క్లుప్తంగా

ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షురాలికి ఘన సన్మానం


లోచల సుజాతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్, నాయకులు

గొలుగొండ: ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాతను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మండల నాయకులు మంగళవారం ద్వారకానగరం గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద పదవి కట్టబెట్టడం చాలా ఆనందంగా ఉందని, ఎమ్మెల్యే సహకారంతో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యన్నారాయణ, సచివాలయం కన్వీనర్ మండలాధ్యక్షుడు పాణీశాంతారామ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట

మాడుగుల రూరల్: ఎం. కోడూరు కాశీవిశ్వేశ్వర ఆలయంలో వల్లీ సుబ్రహ్మణ్యస్వామివారి విగ్రహ ప్రతిష్ట బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ సంజీవిరావు, ఆలయ కమిటీ చైర్మన్ మూర్తి మంగళవారం తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు.

రాయితీపై 14 టన్నుల పశుదాణా పంపిణీ

మాకవరపాలెం: ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన 14 టన్నుల పశుదాణాను రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని మాకవరపాలెం, వజ్రగడ పశువైద్య కేంద్రాల పరిధిలోని 30 మంది రైతులకు రాయితీపై దాణా మంజూరైంది. ఈ నేపథ్యంలో ఈ దాణాను రైతులకు పంపిణీ చేశామని పశువైద్యాధికారి రామ్మోహన్‌రావు మంగళవారం తెలిపారు.

నేడు జేడీపేటలో విగ్రహాల ప్రతిష్ఠాపన

మాడుగుల: జమ్మాదేవి పేటలో బుధవారం దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్టు వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు. చింతలూరులో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరు కానున్నారన్నారు.

ఘనంగా రేగట్లమ్మ తల్లి పండగ

నాతవరం: చినగొలుగొండపేటలో రేగట్లమ్మ తల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పసుపుకుంకుమ, జాకెట్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉత్సవ కమిటీ సభ్యులు తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దాత రాజాబాబు

రోలుగుంట: కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఇన్‌చార్జి హెచ్‌ఎం విద్యావతి మంగళవారం పంపిణీ చేశారు. వీటిని సుబ్రమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కన్‌స్ట్రక్షన్ ఎండీ మటం రాజాబాబు తన సొంత నిధులతో సమకూర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామం కుసుర్లపూడిలో విద్యార్థులు ఉన్నతి స్థితికి చేరుకోవాలనే సంకల్పంతో సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు.

వెల్లివిరిసిన సృజన

- ఆకట్టుకున్న పలు నమూనాలు
- ఘనంగా సైన్స్ దినోత్సవం

విద్యార్థుల్లో సృజనకు కొదవ లేదు. పాఠశాల స్థాయిలోనే వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలే సృష్టిస్తారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వారు తమ ఆలోచనలకు పదును పెట్టి సరికొత్త ఆవిష్కరణలతో ఆలోచింపజేశారు. సమాజంలో నిత్యం మనకు ఎదురయ్యే పలు సమస్యలకు పరిష్కారం చూపుతూ రూపొందించిన నమూనాలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా పాఠశాలల్లో వీటిని ప్రదర్శించగా, మేధావుల ప్రశంసలు అందుకున్నాయి.


బుచ్చెయ్యపేట: కందిపూడిలో నమూనాలను తిలకిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్


నాతవరం: విద్యార్థికి సామగ్రి పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, పూర్వ విద్యార్థి


దేవరాపల్లి: ఎ. కొత్తపల్లి హైస్కూల్‌లో ప్రాజెక్టు నమూనాలతో హెచ్‌ఎం స్వర్ణలత

నర్సీపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం వెంకునాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈవో సాయి శైలజ ప్రారంభించారు. ముందుగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్, హెచ్‌ఎం ఎం.వీరమాంబతో కలిసి సైన్స్ పితామహుడు సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐదో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన సోలార్ సిస్టమ్, ఉప్పునీటి నుంచి విద్యుత్ తయారీ నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాలలో విద్యా విజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ప్రిన్సిపాల్ శివప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన హైడ్రాలిక్ రోడ్డు సిస్టమ్, ఫుడ్ కంపోనెంట్స్, ఎర్త్ అలారమ్ నమూనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శన దోహదపడుతుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.


చోడవరం రూరల్: శాఖా గ్రంథాలయంలో రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును : ఎంఈవో రవీంద్రబాబు

దేవరాపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ఎంఈవో సిహెచ్. రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా హెచ్‌ఎం నాగమణి, కొట్టాన రాంబాబు, ఆదిరెడ్డి ఈశ్వరరావు తదితర ఉపాధ్యాయులతో కలిసి సివి. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. హెచ్‌ఎం వై. స్వర్ణలత ఆధ్వర్యంలో ఏ. కొత్తపల్లి హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన అబ్బుర పరిచింది. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి హెచ్‌ఎం బహుమతులను అందజేశారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్. పాండురంగారావు ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయులు ఎన్. సునీత, డి. పూర్ణానందం, బి. మురళీధర్ పట్నాయక్‌లను సత్కరించారు.


దేవరాపల్లి: కాశీపురంలో రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు

విజ్ఞానశాస్త్ర గతిని మార్చిన దార్శనికుడు రామన్

చోడవరం రూరల్: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయిని బి.రవికళ సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞానశాస్త్రం పురోగతి రామన్ అందించిన సేవలను కొనియాడారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థినులు పలు గీతాలను ఆలపించారు.

గ్రంథాలయంలో.....

స్థానిక శాఖా గ్రంథాలయంలో రామన్ చిత్రపటాన్ని ఆవిష్కరించి గ్రంథాలయ అధికారి జి.తిరుమల కుమారి ఘన నివాళులర్పించారు. దేశ పురోగతికి సైన్సు ఆవశ్యకతను ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వివరించారు. శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని సూచించారు.

క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు

కె.కోటపాడు: విద్యార్థుల ఆలోచనలకు సైన్స్‌ను జోడించి తయారు చేసే ప్రాజెక్ట్‌లతో విజ్ఞానం వికసిస్తుందని హెచ్‌ఎం అనురాధ తెలిపారు. మంగళవారం ఎ.కోడూరు హైస్కూల్‌లో శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ఎరుకునాయుడు, కవిత, మాధవి, మంగ, రమేష్, అమృతరావు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మేధావులను ఆలోచింప చేసేలా విద్యార్థుల ప్రయోగాలు, ఆర్టికల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. టి.అర్జాపురం, చినపాచిల హైస్కూల్ విద్యార్థులు బయో టాయిలెట్స్, హైడ్రోలిక్ బ్రిడ్జి, సోలార్ స్మార్ట్ సిటీ, గ్లోబర్ వార్మింగ్, సౌరశక్తితో వ్యవసాయం, సోయల్ మాయిశ్చర్ ఇండికేటర్, తక్కువ ఖర్చుతో ఎల్‌ఈడీ విద్యుత్ దీపాల వెలుగులు, విండ్ పవర్, మానవ భాగాలు పనితీరు, తదితర నమూనాలను ప్రదర్శించారు.

నాతవరం: జాతీయ సైన్సు డే సందర్భంగా చమ్మచింత పాఠశాలలో పూర్వ విద్యార్థి సామాజిక సేవా కార్యకర్త నానాజీ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశాడు. హెచ్‌ఎం కాశపు సత్యనారాయణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థి తన సొంత నిధులతో వీటిని అందించడం ఆనందాయకమన్నారు. విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అప్పారావు, దార బాబు, నర్సింహమూర్తి తదితరులు సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులు లోకాస్ట్, నోకాస్ట్‌తో కూడిన సైన్సు నమూనాలు ప్రదర్శించారు. సైన్సు ఉపాధ్యాయులు మకిరెడ్డి నాని, కిరణ పాల్గొన్నారు.

సైన్స్ పాత్ర కీలకం

మాకవరపాలెం: నేటి సమాజంలో సైన్స్ పాత్ర కీలకమని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అచ్యుతరామయ్య పేర్కొన్నారు. జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని మంగళవారం మాకవరపాలెం, గిడుతూరు, జి.కోడూరు, బూరుగుపాలెం, వజ్రగడ ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.వి.రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

బుచ్చెయ్యపేట: దేశం అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలంటే సైన్స్ ఎంతో అభివృద్ధి చెందాలని ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. కందిపూడి పాఠశాలలో విద్యార్థులు తయారీ చేసిన పలు నమూనాలను ఎంఈవో పరిశీలించారు. ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి బహుమతులు అందించారు. హెచ్‌ఎం బలరాం, గ్రామ నాయకులు గణేష్, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ భవానీ సురేష్, సైన్స్ ఉపాధ్యాయిని ప్రభావతి తెలిపారు.


రావికమతం: టి.అర్జాపురం హైస్కూల్‌లో నమూనాలను పరిశీలిస్తున్న హెచ్‌ఎం తదితర్లు


కె.కోటపాడు: సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం అనురాధ


రావికమతం: సౌరశక్తి పనితీరును వివరిస్తున్న చినపాచిల హైస్కూల్ విద్యార్థులు


రోలుగుంట: సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


నర్సీపట్నం: నమూనాలను తయారు చేసిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

దర్జీల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

మాడుగుల రూరల్: దర్జీల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని ఆ సంఘం మండలాధ్యక్షుడు ఓమ్మి నాగేశ్వరరావు తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు సూరిశెట్టి జగదీశ్ అధ్యక్షతన మంగళవారం జంపెనలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ముందుగా సీఎం చిత్రపటానికి దర్జీలు క్షీరాభిషేకం చేశారు. సంఘ కార్యదర్శి మట్టా చంటి, విజయభాస్కరరావు, బి. కొండలరావు, బొజ్జా శంకరరావు, లోకేశ్, తనకాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

దర్జీల ర్యాలీ

మాకవరపాలెం: టైలర్స్ డే సందర్భంగా మండలంలోని దర్జీలంతా మంగళవారం మాకవరపాలెంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో మండల టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రుత్తల ఈశ్వరరావు, జోగా జగన్ మాట్లాడారు. సొసైటీ సభ్యులు కాగిత అప్పలరాజు, చింతకాయల రాము, తదతరులు పాల్గొన్నారు.


జంపెనలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దర్జీలు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చీడికాడ: టైలర్స్ డే సందర్భంగా చీడికాడలో దర్జీలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చావిటి వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శివ టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ మండలాధ్యక్షుడు డి.అర్జున్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ చార్జీల్లో రాయితీ కల్పించాలని కోరారు. కో-ఆప్షన్ సభ్యులు షేకు సూర్యనారాయణ, ప్రతాప్, బుచ్చిబాబు, వానపల్లి కొండల రావు పాల్గొన్నారు.


జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దర్జీలు

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

నాతవరం: స్పందన అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది స్పందన అర్జీలపై తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన కారణంగా చూపకుండా తిరస్కరించవద్దన్నారు. సచివాలయాల వారీగా బాధ్యతగా పని చేస్తే అధిక శాతం ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలోనే పరిష్కారమవుతాయన్నారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా దృష్టి సారించాలన్నారు.


స్పందన ఫిర్యాదులపై సూచనలు చేస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి

మాడుగుల రూరల్: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. కె.జె.పురంలో పీలా మోదినాయుడు కుటుంబ సభ్యుల సారధ్యంలో మంగళవారం మోదకొండమ్మకు రెండున్నర కిలోల వెండితో తయారు చేసిన అమ్మవారి పాదాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాదాలను శిరస్సున పెట్టుకుని ఆలయంలో ప్రతిష్టించారు. అమ్మవారి ఒడ్డు పండగ నిర్వహించారు. పీలా రాంబాబు సారధ్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకులు ఆడారి కన్నారావు, కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, కాళ్ల జగన్, ఆడారి నూకగణేశ్, ఎం.వి.సత్యనారాయణ, పీలా శ్రీను, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.


అమ్మవారి వెండి పాదుకలను నెత్తిన పెట్టుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు

8న ఉచిత నేత్ర వైద్య శిబిరం

నర్సీపట్నం: శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో స్థానిక షీర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 8న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్ తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కళ్లజోళ్లు ఉచితంగా సరఫరా చేస్తామన్నారు.

సొంత ఖర్చుతో గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

రోలుగుంట: బుచ్చింపేట పరిధి అర్ల, పాత లోసింగి, కొత్త లోసింగి తదితర గిరిజన గ్రామాల్లో వైద్యాధికారులు సునీత, శ్రీనివాసరాజు వైద్య సేవలు విస్తృతం చేశారు. దీనిలో భాగంగా శరభవరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ముమ్మిన పార్వతి లోసింగి గ్రామానికి వెళ్లి ఇద్దరు గర్భిణులకు ప్రత్యేక సేవలందిస్తున్నారు. మరో నెలలో ప్రసవించనున్న వారిని సోమ, మంగళవారాలు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. శిశువు ఆరోగ్య పరిస్థితి తెలుసుకునే భాగంగా వైద్యాధికారి సునీత తన సొంత నిధులతో నర్సీపట్నం ప్రైవేటు క్లినిక్‌లో స్కానింగ్ తీయించారు. వైద్యాధికారికి గర్భిణులతోపాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలికి సన్మానం


అనురాధను సత్కరిస్తున్న నాయకులు

చీడికాడ: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఈర్లె అనురాధ నియామకంపై పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు హర్షం వ్యక్తం చేశారు. తారువ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, నందారపు రమణబాబు, ధర్మిశెట్టి కొండబాబు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

గొలుగొండ: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. మంగళవారం జోగుంపేటలో పార్టీ మండల నాయకులు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్‌కు పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేసే విధంగా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. మండలంలో 1,026 ఓట్లు వేసే విధంగా కృషి చేయాలన్నారు. టీడీపీ, ఇతర పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదని తెలిపారు. వైస్ ఎంపీపీలు సుర్ల బాబ్జి, జక్కు నాగమణి, పార్టీ యూత్ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

చీడికాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలంటూ మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ మండల నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతికొండబాబు, చీడికాడ గ్రామ శాఖ అధ్యక్షుడు పరవాడ మహేష్, ఎస్.మహేష్, పరువాడ రామారావు, ఈర్లె చైతన్య పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

సుధాకర్ గెలుపుతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్ర అభివృద్ధికి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు కోరారు. మంగళవారం మంగళాపురం, కుముదాంపేట, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు.

ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితానారాయణమూర్తి, సర్పంచ్‌లు విజయ్‌కుమార్, కంటే పద్మరేఖ వెంకట్, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, నాయకులు ఆనంద్, అప్పలరాజు, ఆదినాయుడు పాల్గొన్నారు.

కనులపండువగా గంగాదేవి అమ్మవారి పండగ

తప్పెటగుళ్ల ప్రదర్శనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అడ్డూరు గ్రామంలో గంగాదేవి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి తప్పెడగుళ్ల బృందాలు వచ్చి తమ కళను ప్రదర్శించాయి. ఏటా ఇక్కడ గంగాదేవి అమ్మవారి పండగను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా సాంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ తప్పెటగుళ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తప్పటగుళ్ల బృందాల ప్రదర్శించిన నృత్యాల్లో ధర్మశ్రీ స్వయంగా అప్పన్నస్వామి, వేంకటేశ్వరస్వామి గీతాలు పాడి మంత్రముగ్దుల్ని చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి దర్శించుకున్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ధర్మశ్రీ

కె.జె.పురంలో బీజేపీ నాయకుల ప్రచారం

మాడుగుల రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి.వి.ఎన్. మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు మంగళవారం ప్రచారం చేపట్టారు. కె.జె.పురంలో పార్టీ మండలాధ్యక్షుడు ఉండూరు దేముడు ఇంటింటికీ తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుట్టా రాంబాబు, మాజీ అధ్యక్షుడు సాలాపు వీరునాయుడు పాల్గొన్నారు.


ఓటరును అభ్యర్థిని బీజేపీ నాయకులు

అర్హులకే పథకాలు అందజేయాలి

మాడుగుల: సచివాలయ సిబ్బందితోపాటు వలంటీర్లు అర్హులైన వారికి పథకాలు అందజేయాలని ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. పొంగలిపాక సచివాలయ కార్యాలయంలో ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. చిన్నారులుకు అందిస్తున్న పౌష్టికాహారంతోపాటు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. నాయకుడు నాయిన సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.